www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 2 VOLUME : 2 | సంచిక: 13 ISSUE : 13 | మంగళవారం, 2 జూన్, 2026 TUESDAY, JUNE 2, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

• సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు • తెలంగాణ ప్రజలకు మాజీ సీఎం కెసిఆర్ శుభాకాంక్షలు

2



# 15 తరువాత కేంద్రంపై యుద్ధమే

## ధాన్యం కొనకుంటే కిషన్‌రెడ్డి ఇంటిముందు పారబోస్తాం

• ప్రాణహితపై చర్చిద్దాం.. లేదంటే ఉప్పెనే! • ఏడాదిగా సమయం కోరుతున్నా ఫడణవీస్ ఇవ్వడం లేదు • అవమానాన్ని తెలంగాణ సహించదు • రైతులు, తండాలు, గూడేలు ఉప్పెనై కదుల్తాయ్ • అది మహారాష్ట్రకే సమస్యగా మారుతుంది • కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దూతగా వ్యవహరించాలి • లేదంటే ఆయనను తెలంగాణలో తిరగనివ్వరు • పోలవరం కోసం ఏపీకి మా 7 మండలాలు, లక్షలాది మంది ప్రజలను మోదీ అప్పగించారు • తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం మహారాష్ట్ర నుంచి 2 వేల ఎకరాలు అప్పగించలేరా? • రాష్ట్రంలో కొత్తగా 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు • గూడేల్లో గుడిసెలు లేకుండా అందరికీ ఇళ్లు • కాగజ్‌నగర్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/ఆసిఫాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 1:

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజీపై చర్చించుకుందామంటూ లేఖ రాస్తే మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ స్పందించడం లేదని, ఆయన సమయం ఇవ్వకపోతే సమస్య మరింత తీవ్రమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లా రైతాంగం ఉప్పెనగా మారుతుందని, అది మహారాష్ట్రకే సమస్యగా తయారవుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దూతగా వ్యవహరించాలని, మహారాష్ట్ర సీఎం వద్దకు తనను తీసుకెళ్లాలని లేకపోతే కిషన్‌రెడ్డిని తెలంగాణలో ప్రజలు తిరగనివ్వరని చెప్పారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మిగతా 2లో..



## ప్రోరేటా మేరకు నదీ జలాలు అందాలి

• ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల అంశంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలి • డ్యామ్‌ల వారీగా నీటి విడుదలకు కార్యాచరణపై చర్చించాలి • జలాశయాల గేట్ల మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలి • వర్షాకాల సన్నద్ధతపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 1:

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయన్న వాతావరణశాఖ అంచనాల నేపథ్యంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా జలాలు పక్కాగా దక్కేలా చూడాలని స్పష్టం చేశారు. ఎగువ రాష్ట్రాలు డ్యాములన్నీ నింపుకొన్నాకే.. దిగువకు నీళ్లు వదిలితే మనకు ఇబ్బందులు వస్తాయని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ మేరకు మహారాష్ట్ర, కర్ణాటక అధికారులతో ముందుగానే చర్చించి.. అంతరాష్ట్ర జలాల్లో ప్రోరేటా ప్రకారం తెలంగాణకు అందేలా తగిన కార్యాచరణ రూపొందించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రలోని కోయినా డ్యామ్ నీటిని ఆ రాష్ట్రం పూర్తిగా జల విద్యుదుత్పత్తికే వినియోగిస్తోందని.. ఆ నీరంతా తెలంగాణకు ఇచ్చేలా, బదులుగా తెలంగాణ నుంచి విద్యుత్ ఇచ్చేలా చర్చించాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు. వర్షాకాల సన్నద్ధతపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష మిగతా 2లో..

# 2 రోజుల్లో హెల్త్‌కేర్ ట్రస్టు

• ఉద్యోగుల సూచనలతో వారంలో మార్గదర్శకాల విడుదల • 10రోజుల్లో ఈహెచ్‌ఎస్ అమలు • భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే ఒకరి నుంచే వాటా • ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలలో సిఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-జూన్ 1:

రాష్ట్రంలోని ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు మంగళ వారం నుంచి గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు స్పష్టం చేశారు. హెల్త్ కేర్ ట్రస్టు ద్వారా ఇందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉద్యోగ సంఘాలకు తెలిపారు. రెండురోజుల్లో ట్రస్టు ఏర్పాటు చేస్తున్నామని, వారంలోగా విధివిధానాలు ఖరారు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా మూల వేతనం నుంచి 1.5 శాతం కోత విధించడంపై ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యులు, ఉద్యోగ సంఘాల నేతలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, పింఛనుదారులు,వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ట్రస్టు స్వయంప్రతిపత్తితో, పారదర్శకంగా సేవలందిస్తుందన్నారు. మిగతా 2లో..



## ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో.. మనమే నం.1

• యాసంగిలో 64 లక్షల టన్నులు కొన్నాం • రైతులకు 11,500 కోట్ల చెల్లింపులు పూర్తి • కేంద్రం సేకరిస్తున్న ధాన్యంలో 63% రాష్ట్రం నుంచే: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి • కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని ప్రకటన

తిరుమలగిరి/హుజూర్‌నగర్, (వార్త వేదిక సూర్య)-జూన్ 1:

ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సేకరించిన ధాన్యంలో తెలంగాణ నుంచే 63 శాతం ఉందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు రూ.11,500 కోట్లు చెల్లించినట్లు వివరించారు. సోమవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. తరుగు తీసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజ్‌సనందలాల్‌ను మంత్రి ఆదేశించారు. అనంతరం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లాలో ఈ నెల నాలుగో తేదీలోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. యాసంగిలో 64 లక్షల మెట్రిక్ టన్నుల మిగతా 2లో..



## బాల్క సుమన్‌పై ఆస్తుల విధ్వంసం కేసు

• సెక్షన్ చెల్లదన్న నాంపల్లి కోర్టు

2 లో..



2 లో..

## పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ

• తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా అనుమతి ఇవ్వలేమని స్పష్టం • కోర్టును ఆశ్రయించారు పార్టీ నేతలు

## ధాన్యం సేకరణలో కాంగ్రెస్ విఫలం

• రైతులను ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం • ప్రభుత్వ తీరుపై మండిపడ్డ రామచంద్రరావు • నేడు ఢిల్లీలో ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడి



న్యూఢిల్లీ, జూన్1: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వడ్లను కేంద్రం ఎప్పుడు కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాంచందర్‌రావు విడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాంచందర్‌రావు మిగతా 2లో..

## రాయదుర్గంలో భూముల ధరలకు రెక్కలు

వేలంలో ఎకరాకు రూ.204 కోట్ల ధర

2 లో..



# ప్రోరేటా మేరకు నదీ జలాలు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు.

**వరదల సద్వినియోగంపై దృష్టిపెట్టండి**

గోదావరి నది నుంచి ఏటా వేల టీఎంసీల జలాలు సముద్రం పాలవుతున్నాయని.. కానీ వరదంతా స్వల్ప కాలంలోనే వస్తోందని సీఎం గుర్తు చేశారు. ఈ క్రమంలో ఇటు గోదావరి, అటు ప్రాణహిత వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నిర్మించిన సీలేరు, తుంగభద్ర డ్యామ్‌ల నుంచి ఉత్పత్తవుతున్న విద్యుత్‌లో తెలంగాణకు రావాల్సిన వాటాపై నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. గతంలో కడెం ప్రాజెక్టు వద్ద తలెత్తిన ఇబ్బందులను గుర్తు చేశారు. వాతావరణశాఖ అంచనాలు, నివేదికల ఆధారంగా రాష్ట్రంలో పంటలసాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంట రకాల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్రానికి లేఖ రాస్తామని తెలిపారు.

**విపత్తులపై తక్షణమే స్పందించాలి**

గత ఏడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీల అమలుపై సీఎం ఆరాతీశారు. హామీల అమల్లో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. వరదల సమయంలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనల మరమ్మతుల కోసం విపత్తు నిర్వహణశాఖ వద్ద ఉన్న రూ.1,000 కోట్ల నిధులను వినియోగించుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోడ్లపై వరదనీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని..నీరు నిలిచే 141ప్రదేశాల్లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లా, రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిశాఖలు సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

**మానవత్వంతో వ్యవహరించాలి!**

విపత్తులతో ప్రాణ, ఆస్తినష్టం జరిగిన కుటుంబాలకు సకాలంలో పరిహారం అందించకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది భారీ వర్షాలు, వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో బాధితులకు ఇచ్చిన హామీల అమలు ఆశించిన స్థాయిలో లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ.. "విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లినప్పుడు అధికారులు తక్షణమే స్పందించాలి. వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలి. కానీ నెలలు గడుస్తున్నా పరిహారం అందించకపోవడం ఏమిటి? కనీస మానవత్వం లేదా? తగిన సమయంలో పరిహారం అందిస్తే బాధిత కుటుంబాలకు ఉపశమనం కలుగుతుంది. మరోసారి నిర్లక్ష్యంగా వహించవద్దు" అని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇక హైదరాబాద్ నగరంలో రోడ్లపై నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మాణంలో నిర్లక్ష్యంపైనా సమీక్షలో మండిపడినట్టు తెలిసింది. "నేను చెప్పిన 11 ప్రాంతాలు తప్ప.. ఇంకెక్కడా వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటుచేయాలనే ఆలోచన రాలేదా. అందుకు అవకాశం ఎక్కడా లేదా?" అని ప్రశ్నించినట్టు సమాచారం.

# ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో.. మనమే నం.1

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 నుంచి 72 గంటల్లోనే డబ్బులు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు.

**త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు**

రాష్ట్రంలోని అర్హులందరికీ త్వరలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ఉత్తమ్ తెలిపారు. హుజూర్‌నగర్‌లో నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కార్డులు అందజేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తూ ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే.. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

# ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# 15 తరువాత కేంద్రంపై యుద్ధమే

(మొదటి పేజీ తరువాయి)



మండలంలోని కొత్తగూడ కొరా రిలో సోమవారం రెండోవిడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొ న్నారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రసంగిం చారు. రాష్ట్రంలో కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ప్రకటించిన 4.50లక్షల ఇళ్లలో 1.20 లక్షల ఇళ్ల గృహ ప్రవేశాలు జరిగాయని, సెప్టెంబరు 17నాటికి మరో లక్ష ఇళ్లు సిద్ధం చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి లేమిపై సీఎం తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'ఆదిలాబాద్ జిల్లా అనగానే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు గుర్తుకొస్తది. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించే ఈ ప్రాజెక్టును గత పాలకులు పడావు పెట్టారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వద్దకు ప్రాజెక్టును తీసుకెళ్లి, రూ.లక్ష కోట్లను ఖర్చు పెట్టారు. కాళేశ్వరం కూళేశ్వరం కావడం, లక్ష కోట్లు గంగలో కలిసిపోవడం జరిగింది.

ఆదిలాబాద్‌లో ఎకరానికి కూడా నీళ్లు రాలేదు. ఇంతకుముందే కుమ్రం భీం ప్రాజెక్టును చూశా. 10 టీఎంసీల ప్రాజెక్టుకు రిపేర్లు చేయకపోవడం వల్ల కేవలం 4 టీఎంసీల నీటిని మాత్రమే నిలుపుకొనే పరిస్థితి ఉంది. జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ప్రాజెక్టులు పడావు పడ్డాయి. అందుకే ఆదిలాబాద్ జిల్లాను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నాం. ఆనాడు వైఎస్సార్ మొదలుపెట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లివ్వాలని నిర్ణయించాం. మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాం. ఆయన ఇంతవరకు స్పందించలేదు. అంతరాష్ట్ర జల వివాదాలను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సామరస్యంగా పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి చెప్పారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రుల స్థాయి సమావేశానికి సమయం ఇవ్వాలంటూ మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌ను ఏడాదిగా కోరుతున్నా. అయినా స్పందన లేదు. మీరు సమయం ఇవ్వకపోతే... ఆ సమస్య తీవ్రంగా మారుతుంది. ఆదిలాబాద్ జిల్లా ఉప్పెనై కదులుతుంది' అని హెచ్చరించారు. ఫడణవీస్! గుర్తు పెట్టుకోండి.. తెలంగాణను నిర్లక్ష్యం చేస్తే, అవమానిస్తే ఊరుకోదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముందుకురావాలన్నారు. 'మహారాష్ట్ర సీఎం కనీస గౌరవాన్ని పాటించడం లేదు. నేను నీకు నచ్చకపోవచ్చు. నీ చీకటి మిత్రుడు కేసీఆర్‌కు నచ్చకపోవచ్చు. కానీ ఈ సమస్య లక్షలాది తెలంగాణ రైతులది. దీని పరిష్కారానికి కిషన్‌రెడ్డి దూతగా వ్యవహరించాలి. మీరు మహారాష్ట్ర సీఎం వద్దకు నన్ను తీసుకెళ్లండి. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేయాలంటే... 1500 ఎకరాల భూసేకరణకు మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఆనాడు పోలవరం ప్రాజెక్టుకు ఆటంకమవుతున్నాయంటే.. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఉన్న 7 మండలాలను, లక్షలాది తెలంగాణ బిడ్డలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పజెప్పింది మీరు కాదా అని ప్రధాని మోదీని రేవంత్ ప్రశ్నించారు. 'ఈనాడు తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 2 వేల ఎకరాలను ఇప్పించలేరా నరేంద్రమోదీ? మేముఊళ్లను, మనుషులను అడగటం లేదు. అక్కడ ముంపునకు గురయ్యే భూములను అడుగుతున్నాం. ఎంత ఖర్చయినా ఇస్తాం. ఇంత చిన్న సమస్యను ప్రధానమంత్రి, కిషన్‌రెడ్డి పరిష్కరించలేరా? తెలంగాణ సీఎం అంటే ఇంత చిన్న చూపా? పంచాయితీ కావాలా పరిష్కారం కావాలాఅని అంటే... నేను పరిష్కారం కోరుకుంటా. సమస్య పరిష్కారం కానట్లయితే... పంచాయితీ ద్వారా పరిష్కరించుకోవడానికి నేను సిద్ధం. ఇందులో మహారాష్ట్ర సీఎం ఉన్నాడా, కిషన్‌రెడ్డి ఉన్నాడా అనేది చూడను. నాకు ప్రజలు, రైతుల సమస్యలే ముఖ్యం' అని అన్నారు.

**ఆదివాసీ బిడ్డల సొంత ఇంటి కల**

60–70 ఏళ్లుగా ఆదిలాబాద్ జిల్లాకు జరిగిన అన్యాయాలను పరిష్కరించాలంటే ఆషామాషీ కాదని, ఈ ప్రయత్నంలో జిల్లా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పరిష్కరించుకుంటూ వారిని తోడుగా తీసుకెళ్తున్నామని రేవంత్ చెప్పారు. 'ఆదిలాబాద్ ఆదివాసీ బిడ్డలు మణులు, మాణిక్యాలు అడగలేదు. వైఢూర్యాలు, వైఢూర్యాలు అడగలేదు. ఆత్మగౌరవంతో బతకడానికి గూడెంలో సొంత ఇల్లు ఉండాలని కోరుకున్నారు. వారి కలను సాకారం చేయకపోతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరనట్లేనని ఆలోచించి, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇంది రమ్మ ఇళ్ల చొప్పున 4.50లక్షల ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నాం'అని వెల్లడించారు. నాగోబా జాతరకు ఆహ్వానించడానికి తన వద్దకు ఆదివాసీ పెద్దలు వచ్చినప్పుడు... గూడేలు, ఐటీడీ ఏల పరిధిలో 21 వేల ఇళ్లను అదనంగా మంజూరు చేయాలని అధికారులకు చెప్పానన్నారు. కొరాకి వెళ్లినప్పుడు కొలాం సోదరులు కొంత మందికి ఇంకా ఇళ్లు రాలేదని చెప్పారని, ఈ నేపథ్యంలో తెలంగాణలోని గూడేలు, తండాలలో ఉండేవారికి నూటికి నూరు శాతం ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించా మని తెలిపారు. 'పార్టీ లకు అతీతంగా ఎమ్మెల్యేలకు సూచన చేస్తున్నా. ఏడాదిలోపు ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క గుడిసె కూడా ఉండడానికి వీల్లేదు. తల తాకట్టు పెట్టయినా నిధులు తీసుకు వచ్చే బాధ్యత నాది. గతంలో ఇచ్చిన 4.50 లక్షల ఇళ్లలో 1.20 లక్షల ఇళ్లను 13 నెలల్లో పూర్తి చేసుకున్నామని, సెప్టెంబరు 17వ తేదీ నాటికి మరో లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు చేయడానికి సంపూర్ణ ఏర్పాట్లు చేస్తామన్నారు. గిరిజన గూడెం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు.

**కొత్తగా మరో 2.5 లక్షల ఇళ్లు**

రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని, అందుకనే మరో రెండున్నర లక్షల ఇళ్లను కొత్తగా మంజూరు చేస్తున్నామని సీఎం ప్రకటించారు. గతంలో పనులు మొదలు పెట్టి, కాస్తో కూస్తో బిల్లులు వచ్చిన ఇళ్ల స్థానంలో వీటిని ఇస్తామన్నారు. ఆనాడు ఇందిరమ్మ ఇళ్లు, గృహ లక్ష్మి పథకం కింద కాగితం ఉన్నవారిని ఈ ఇళ్లలో భాగస్వాములు చేస్తామని తెలిపారు. ధాన్యం సేకరణ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఇప్పటికే 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మరో 10–15 లక్షల మెట్రిక్ టన్నులు వస్తాయన్న అంచనాలున్నాయని, ఆ ధాన్యాన్ని కూడా ఈ నెల 15 లోపు సేకరిస్తామని స్పష్టం చేశారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి ఎన్నిసార్లు కోరుతున్నా... పంజాబ్, హరియాణా వంటి ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాధాన్యం తెలంగాణకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రప్రభుత్వం సేకరించిన వడ్లు, మొక్కజొన్నలు, పొద్దుతిరుగుడును కేంద్రంతో కొనిపించే బాధ్యత కిషన్‌రెడ్డి తీసుకోవాలని చెప్పారు. జూన్ 15 తర్వాత కూడా కొనకపోతే కిషన్‌రెడ్డి ఇంటి వద్ద, బీజేపీ కార్యాలయం వద్ద వాటిని పోస్తామని హెచ్చరించారు. 'రైతులు అధైర్యపడొద్దు. ప్రతి గింజనూ కొంటాం. తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం' అని సీఎం హామీ ఇచ్చారు. అంతకు ముందు కొలాం కొరారి గ్రామపంచాయతీ కొత్తగూడ గ్రామంలోని సిడాం కన్నీబాయి, టేకం పగ్గుబాయి, ఆత్రం పోచుబాయిలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లను సీఎం ప్రారంభించారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# 2 రోజుల్లో హెల్త్‌కేర్ ట్రస్టు ఏర్పాటు..

(మొదటి పేజీ తరువాయి)

ట్రస్టు కోసం ప్రత్యేక బ్యాంకుఖాతా తెరిచి అందులో ప్రభుత్వ, ఉద్యోగుల వాటాలను జమ చేయనున్నట్లు వివరించారు. ట్రస్టు నిర్వహణ, సేవలు, ఫిర్యాదుల వ్యవస్థ తదితర అంశాలపై ఉద్యోగులు సూచనలు చేశారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బెనహర్ మహేశ్, దానకిశోర్, ప్రధాన కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, క్రిస్టినాజోంగ్తు, యోగితారాణా, రెవెన్యూ శాఖకార్యదర్శి లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

**రెండు, మూడు రోజుల్లో కమిటీ ఏర్పాటు**

ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, పర్యవేక్షణ కోసం రెండు, మూడు రోజుల్లో ప్రత్యేక ఈహెచ్ఎస్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపిందని ఐకాస ఛైర్మన్ మారంగ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో వైద్య సేవలను అందించేందుకే ఉద్యోగుల మూల వేతనం నుంచి 1.5 శాతం కోత విధించినట్లు సీఎస్ తెలిపారన్నారు. కాగా భార్య, భర్త ఉద్యోగులుగా ఉంటే ఒకరి వేతనం నుంచే కోత విధించాలని, పోలీసు, ఎక్సైజ్ శాఖల్లో వేర్వేరు పేర్లతో ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నారని, ప్రస్తుత ఈహెచ్ఎస్‌లో మినహాయింపు ఇస్తారా అని ఐకాసా ప్రశ్నించింది. ఆయుష్ ఆసుపత్రుల్లో అవకాశం కల్పించాలని, కుటుంబ సభ్యులను పరిగణించే క్రమంలో సోదరి, సోదరులను కూడా అనుమతించాలని, దంపతుల్లో ఒకరు ఉద్యోగి, ఒకరు పింఛనుదారుగా ఉంటే ఎవరి వేతనం నుంచి కోత ఉంటుందో స్పష్టత ఇవ్వాలని, ఏడాదికి ఒకసారి ఆరోగ్య పరీక్షలకు అవకాశం కల్పించాలని, అలాగే ఇతర రాష్ట్రాల్లో చికిత్సకు అనుమతిస్తారా లేదా స్పష్టత ఇవ్వాలని, చికిత్స ప్యాకేజీ పరిమితి ఎంతో తెలపాలని కోరారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకట్... ఉద్యోగులకు సమాచారం ఇవ్వకుండా వేతనాల కోత విధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

# నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)–జూన్1: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్‌గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణీకులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ బాటిల్ క్యారీ చేయాలని సలహా ఇచ్చారు.

**తెలంగాణ ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న కేసీఆర్ వారికి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల విద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిలా మార్చుకున్నామని, 'పరిపాలన చేతగాదు' అని విమర్శించిన నోళ్లు మతపడేలా ప్రగతి పాలనను అందించామని గులాబీ అధినేత గుర్తు చేశారు. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన పదేండ్ల కాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నామని కేసీఆర్ వివరించారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, విద్య వైద్యం తదితర సంక్షేమ రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతి నేడు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిందనీ కేసీఆర్ తెలిపారు. ఒకప్పుడు ఎడారిలా మారిన తెలంగాణను.. నేడు కోటి ఎకరాల మాగాణంగా మార్చి, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత నాటి పదేండ్ల బీఆరఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని కేసీఆర్ ఘంటాపథంగా చెప్పారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ హెచ్చరించారు. ప్రతీప శక్తుల నుండి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని కేసీఆర్ సూచించారు. తెలంగాణకు బీఆరఎస్ పార్టీ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలనీ కోరిన ఆయన.. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలనీ సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం నిరంతరం ప్రగతి పథంలో దూసుకుపోవాలని, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆకాంక్షించారు. ల్గతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు, సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్టు కేసీఆర్ పేర్కొన్నారు.

## బాల్కపై ఆస్తుల విధ్వంసం కేసు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)–జూన్1:

సింగరేణి కార్యాలయంపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్టయిన బాల్క సుమన్ వ్యవహారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. అతడిపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సెక్షన్ వర్తించదని నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది. బాల్క సుమన్‌పై కేసులో 2 సెక్షన్లు మాత్రమే వర్తిస్తాయని కోర్టు వెల్లడించింది. అతడిపై నమోదు చేసిన మిగిలిన సెక్షన్లను నాంపల్లి కోర్టు తొలగించింది. బాల్క సుమన్‌పై నమోదైన కేసు నేపథ్యంలో సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. సుమన్ రిమాండ్ రిజక్ట్ కోరుతూ మెమోను దాఖలు చేశారు. మే 26వ తేదీన తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్ సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడుతూ.. నాంపల్లిలోని సింగరేణి భవన్‌తోపాటు మందమర్రిలోని సింగరేణి జీఎం కార్యాలయంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సింగరేణి భవన్ అధికారులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

## రాయదుర్గంలో భూముల ధరలకు రెక్కలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)–జూన్1:

రాయదుర్గం ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి ఆకాశాన్ని తాకాయి. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్వహించిన భూముల వేలంలో ఎకరాకు రూ.204 కోట్ల ధర పలికింది. దీంతో ఐటీ కారిడార్‌లో భూములకు ఉన్న భారీ డిమాండ్ మరోసారి స్పష్టమైంది. తాజాగా టీజీఐఐసీ 5.09 ఎకరాల భూమిని వేలానికి పెట్టగా, ఈ వేలం ద్వారా వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది. ఐటీ, వాణిజ్య రంగాల విస్తరణతో ఈ ప్రాంతంలో భూముల విలువలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, కేవలం రెండు రోజుల క్రితమే నిర్వహించిన మరో భూముల వేలంలో ఎకరాకు రూ.237 కోట్ల రికార్డు ధర పలికింది. ఆ వేలం ద్వారా టీజీఐఐసీకి రూ.1,490 కోట్ల ఆదాయం లభించింది. నేజా వేలం, గత వేలం కలిపి రెండు విడతల్లో టీజీఐఐసీకి దాదాపు రూ.2,500 కోట్ల ఆదాయం సమకూరింది. రాయదుర్గం ఐటీ కారిడార్‌లో భూముల కోసం పెట్టుబడిదారులు, సంస్థలు తీవ్ర పోటీ పడుతుండటంతో భూముల ధరలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి.

## పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)–జూన్1:

జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

## టెట్ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదల

జూన్ 16 నుంచి జూన్ 22 వరకు పరీక్షలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)–జూన్1:

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష '2026 షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలు జూన్ 16 నుంచి జూన్ 22 వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం షిఫ్ట్ 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ 2 గంటల నుంచి 4:30 గంటల వరకు ఉంటుంది. పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. పేపర్'1, పేపర్'2 పరీక్షల తేదీలతో పాటు ఉత్తీర్ణత ప్రమాణాలను కూడా అధికారులు వెల్లడించారు. దీంతో పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ ప్రణాళికలను మరింత మెరుగ్గా రూపొందించుకునే అవకాశం లభించింది. టీఎస్ టెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు సాధించాలి.బీసీ అభ్యర్థులు 50 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధిస్తే అర్హత పొందుతారు.

సంపుటి: 2 సంచిక: 13 వార్త వేదిక సూర్య హైదరాబాద్ మంగళవారం, జూన్ 02, 2026



## చౌటుప్పల్ లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**మున్సిపాలిటీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**

చౌటుప్పల్ 1 వార్తా వేదిక సూర్య



చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి ఏర్పాటుచేసిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఆయన పాల్గొన్నారు. పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తో మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు రాజగోపాల్ రెడ్డికి శాలువాలతో సన్మానం చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు శాలువాలతో బొక్కలతో శుభాకాంక్షలు తెలిపి బొకేలు అందజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## నియోజకవర్గ ప్రజల మధ్యన కుటుంబ సభ్యులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**జన్మదినం సందర్భంగా మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన రాజ్ గోపాల్ రెడ్డి దంపతులు**

**జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరంలో బ్లడ్ డొనేట్ చేసిన యువకులు**

చౌటుప్పల్ 1 వార్తా వేదిక సూర్య



మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి 59వ జన్మదిన వేడుకలు మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ప్రజల మధ్యన కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు... ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో తన సతీమణి లక్ష్మితో కలిసి మొక్కలు నాటారు..59 సంవత్సరాలను పురస్కరించుకొని 59 మొక్కలను ప్రజలతో కలిసి నాటారు... అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం హాల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తాన్ని డొనేట్ చేస్తున్న యువకుల్ని ప్రోత్సహించారు. జన్మదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు రాజగోపాల్ రెడ్డి దంపతులకు వేద ఆశీర్వచనం చేసి ఆశీర్వదించారు. అనంతరం రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మి, కుమారుడు సంకీర్త్ రెడ్డి, కోడలు తరుణ్య, మనమరాలు వాన్య తో పాటు కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు... కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి మనగోడు నియోజకవర్గ ముఖ్య నాయకులతోపాటు అన్ని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.. నియోజకవర్గానికి చెందిన అధికారులు పోలీసులతో పాటు వివిధ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.. బొకేలు శాలువాలు తీసుకురావద్దు వీలైతే పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోట్ బుక్స్ పెన్నులు తీసుకురావాలని ఇచ్చిన పిలుపునందుకుని చాలా మంది పెన్నులు నోట్ బుక్స్ ప్రెసెంట్ చేశారు...తన 59 వ జన్మదిన వేడుకలు నియోజకవర్గ ప్రజల మధ్య కుటుంబసభ్యులతో కలిసి గడుపుకోవడం సంతోషంగా ఉన్నదని రాజగోపాల్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అధికారులు భారీ సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు.

# బిజెపి 12 ఏండ్ల పాలన అస్తవ్యస్తం



**మునుపెన్నడు లేనంతగా ధరల భారం**

**2014లో చమురు బ్యారెల్ ధర 105 డాలర్లు ఉన్నప్పుడు పెట్రోల్ లీటర్ రూ.72**

**2026 లో బ్యారెల్ ధర 96 డాలర్లుకు తగ్గిన పెట్రోల్ ధర మాత్రం రూ.110**

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్.**

యాదాద్రి భువనగిరి జూన్ 1 వార్తావేదిక సూర్య

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన అనేది అస్తవ్యస్తంగా తయారయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ అన్నారు. సోమవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని సింగన్నగూడెం బైపాస్ లో కామ్రేడ్ బట్టుపల్లి శ్రీనివాస్ 15వ వర్ధంతి సభ సందర్భంగా పార్టీ అరుణ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు కొలుపుల కృష్ణ ఆవిష్కరించగా, బీజేపీ 12 ఏండ్ల పాలన, విద్వేషం, వైఫల్యాలు అనే అంశంపై సెమినార్ ను సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య అధ్యక్షతన నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల పైన అధిక భారాలు మోపుతూ పాలన కొనసాగిస్తుందని, మునుపెన్నడూ లేనంతగా ధరలకు హద్దే లేదనిన్నారు. 2014లో చమురు బ్యారల్ ధర 105 డాలర్లు ఉన్నప్పుడు పెట్రోల్ లీటర్ రూ.72 ఉన్నదని, 2026లో బ్యారెల్ ధర 96 డాలర్లకు తగ్గిన పెట్రోల్ ధర మాత్రం రూ. 110 ఉందనిన్నారు. కేంద్రం విధించే ఎక్సైజ్ డ్యూటీ రాష్ట్రాల విధించే వ్యాట్ డీలర్ల కమిషన్ మొత్తం కలిపి ప్రజలకు భారం అవుతుండగా, పేద ,మధ్యతరగతి ప్రజలపై 20 రోజుల కాలంలోనే లీటర్ కు రూ.8 పెరిగిందన్నారు. దాంతోపాటే నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి అందేటట్లు ధరలు పెంచుతున్నారనిన్నారు. దేశంలో బిజెపి పాలన ఎలా ఉన్నదని ప్రజలు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని వారు అన్నారు.

దేశంలో నిరుద్యోగం 14.8% ఉన్న కేంద్రానికి చలనం లేదని, 2014లో డాలర్ విలువ 58 రూపాయలు ఉంటే నేడు 96 రూపాయలకు దిగజారిందని ,దీనికి కారణం బిజెపి అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే అన్నారు. బిజెపి పాలనలో రైతాంగం ఇబ్బందుల పాలయ్యారని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, విత్తన చట్టం, వాణిజ్య ఒప్పంద చట్టం వంటివి రైతుల బ్రతుకులను ఆగం చేస్తున్నాయని అన్నారు. లేబర్ కోర్స్ ద్వారా 12 గంటల పనికి ద్వారం తెరిచారని ఈ చట్టం కార్మికుల శ్రమను దోపిడీ చేసేటట్లు ఉన్నదని ఉన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం జి రామ్ జి పేరుతో కొత్త చట్టం తెచ్చిందని ఈ చట్టంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రెండువేల కోట్లు రూపాయలు అదనపు భారం పడుతుందని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మత విద్వేషాలు తీవ్రంగా పెరిగాయని, భారత రాజ్యాంగాన్ని మార్చి లౌకిక ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేసే కుట్ర తీవ్రంగా జరుగుతుందని వారు అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఎండగట్టాలని, ప్రజలు అప్రమత్తమై బిజెపి కుట్రలను తిప్పికొట్టేటట్టు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, సూర్యాపేట మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు బట్టు రామచంద్రయ్య 26వ వార్డు కౌన్సిలర్ చీమల రాజు ,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు గౌడ్, కల్లూరి మల్లేశం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ,

దయ్యాల నరసింహ, సిరిపంగి స్వామి, గడ్డం వెంకటేష్, పి ఎం సి నాయకులు సురుపంగ శివలింగం సిపిఎం నాయకులు బందెల ఎల్లయ్య, ఎదు నూరి మల్లేశం,వనం రాజు, కల్లూరి నాగమణి, ఈర్లపల్లి ముత్యాలు, లావుడియా రాజు, వడ్డబోయిన వెంకటేశం, బర్ల వెంకటేశం, వల్దాస్ వెంకటేష్, దండు పద్మారావు, ఆడెపుగిరి, దండు యాదగిరి, మాయ రాణి, ఈర్ల రాహుల్, బట్టుపల్లి నవీన్, మాయ రాణి గంధ మల్ల బాలమణి, కొత్త లలిత, మాటూరి కవిత, తదితరులు పాల్గొన్నారు.

# సబ్ సెంటర్ పరిధిలో డాక్టర్లు గొర్ల కాపర్లకు అందుబాటులో ఉండాలి



**జి ఎం పి ఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ....**

యాదాద్రి భువనగిరి జూన్ 1 వార్తావేదిక సూర్య

భువనగిరి మండల పశువైద్యశాల పరిధిలో గల సబ్ సెంటర్ ల డాక్టర్లు గొర్ల మేకల కాపర్లకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని

జి ఎంపీఎస్ ( గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం) జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహా కోరారు. సోమవారం భువనగిరి మండలంలోని ముస్త్యాల పెల్లి , చీమల కొండూరు, రాయగిరి గొర్రెల మందల ను సందర్శించి, గొర్ల కాపరులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముస్త్యాలపల్లి , చీమల కొండూరు గ్రామానికి సంబంధించిన డాక్టర్ సుమారు 6 నెలల సుమారు ఆరు నెలల నుంచి గొర్ల కాపరులకు అందుబాటులో లేడని, ఫోన్ చేసిన స్పందించడం లేదని ఆరోపించారు.

ఉచిత టీకాలను సకాలంలో పంపిణీ చేయకపోవడం వలన, గొర్ల కాపరులు ప్రైవేట్ మందులను కొనుగోలు చేసి, ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా సబ్ సెంటర్లో ఉన్న డాక్టర్లు ప్రతి ఒక్కరు గొర్ల కాపరులకు , రైతులకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వం పంపిణీ చేసే మందులు, ప్రతి టీకాలను వారికి ఉచితంగా పంపిణీ చేసి, వైద్యం అందించాలి. గొర్ల కాపరులకు సీజన్ గా వచ్చే వ్యాధుల మందులను సకాలంలో పంపిణీ చేయాలని కాపర్లు కోరారు. సబ్ సెంటర్ల డాక్టర్లపై పై అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, జిల్లా యంత్రాంగం స్పందించి గొర్ల కాపరులకు సకాలంలో వైద్యం అందించాలి. రాయగిరి గొర్ల కాపరులకు ప్రధానంగా మందులతో పాటుగా ఉచితంగా ప్రభుత్వ భూములలో 559 జీవో ప్రకారంగా ప్రభుత్వ భూములు, అటవి శాఖ భూములు కాపర్లు మేత మేపుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. గొర్ల కాపరుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేసి, గొర్ల కాపరులను ఆదుకోవాలని నర్సింహా అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మండల కార్యదర్శి పాక జహంగీర్, మండల అధ్యక్షులు దేవునూరి బాలయ్య, జిల్లా కమిటీ సభ్యులు మన్నెబోయిన రాజలింగం, మండల ఉపాధ్యక్షులు పార్వతి దశరథ, తోటకూర అశోక్, సహాయ కార్యదర్శి వడ్డే జమదగ్ని, ఆయా గ్రామాల సంఘం అధ్యక్షులు వడ్డే రమేష్, చిన్నం శ్రీనివాస్, కాపరులు నారి శ్రీశైలం, వడ్డే బీరయ్య, వడ్డే నరసింహ, మటికేల కొమురయ్య, వడ్డే ఆంజనేయులు, పసనాల అంజయ్య, బోదాసు వెంకటయ్య, కరికె అంజయ్య, మంగపండు బుగ్గ మల్లయ్య, బుగ్గ మల్లయ్య, కరికి బాలరాజు, మన్నేబోయిన ఐలయ్య, కొత్త మల్లేష్, కొత్త నరసింహ, మచ్చ జాంగిర్, చిన్నం జమాల్ లు పాల్గొన్నారు.



## గుడిపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి

దేవరకొండ జూన్ 1 ( వార్త వేదిక సూర్య ):-

మండల కేంద్రంలోని ఎర్ర బ్రహ్మం లక్ష్మమ్మ గార్ల నూతన గృహప్రవేశం కార్యక్రమంలో గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొని నూతన గృహప్రవేశం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలోని వారికి నూతన వస్త్రాలు అందించడం జరిగింది గ్రామ కార్యదర్శి నవీన్ మాజీ ఉమ్మడి మండల వైస్ ఎంపీపీ సరిత నరసింహ మార్కెట్ డైరెక్టర్ భూతం సైదులు , మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎర్ర యాదగిరి , స్థానిక వార్డు సభ్యులు ఎర్ర వంశీ బోడ నాగరాజు,కత్తుల రమేష్ గ్రామ పెద్దలు సముద్రాల పరమేష్ ,మాజీ సర్పంచ్ మోపురి ఆంజనేయులు,గారు పోచం రెడ్డి వెంకటరెడ్డి గణపురం సైదులు,మర్రి కృష్ణ,రవి గణపురం మహేష్ తదితరులు పాల్గొన్నారు

## విమలమ్మ మృతదేహాన్ని పూల మాల వేసి నివాళులు

దేవరకొండ జూన్ 1 వార్త వేదిక సూర్య):-



బొల్లనపల్లి గ్రామ పంచాయతీ చెందిన బి ఆర్ ఎస్ మహిళ నాయకురాలు అడపాల విమలమ్మ మృతదేహాన్ని బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రాఘవ చారి, భాస్కర్, ఉడత అంజయ్య, రాజేందర్ రెడ్డి, జీ రెడ్డి, ఉడత సైదులు, వెంకటయ్య, సిద్దయ్య, నరసింహ, అమరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పార్వతమ్మ, యాదయ్య, సైదులు వార్డు సభ్యులు సైదమ్మ తదితరులు పాల్గొన్నారు

## దళిత క్రిస్టియన్ల సభను విజయవంతం చేయండి..

**క్రిస్టఫర్**

నల్లగొండ బ్యూరో, జూన్ 1 (వార్తా వేదిక సూర్య )




కేంద్ర ప్రభుత్వం దళిత క్రిస్టియన్ల ఎస్సీ హోదాను రద్దు చేయాలని కుట్రలు చేస్తుందని అందుకు నిరసనగా యావత్ క్రైస్తవ సమాజం ఒక్కటై పోరాటం చేయాలని టీఎస్ క్రిస్టఫర్ పిలుపునిచ్చారు. ఈనెల 13 న నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్ లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరుతూ ఏఐసిఎఫ్ నల్లగొండ కో ఆర్డినేటర్ పెద్దమాముడేవిడ్ రాజుఅధ్యక్షతన సోమవారం పట్టణంలోని సువార్త నిలయంలోవివిధ గ్రామా ల నుంచి జిల్లా వ్యాప్తంగా నల్లగొండ పాస్టర్ ఫెలోషిప్, పెద్దలు, రోమన్ క్యాథలిక్ పాదర్స్, ఎంప్లాయిస్, క్రైస్తవులు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం లో టీఎస్ క్రిస్టఫర్ పాల్గొని మాట్లాడుతూ.. దళితక్రిస్టియన్ ల ఎస్సీ హోదాను రద్దు చేసే ఆలోచనను నిరసిస్తూ ఏఐసీఎఫ్ ఆధ్వర్యంలోఈనెల 13 న నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్ లో నిర్వహించే సభను విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు. ఈ సభకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ఈబహిరంగ సభ ను విజయవంతంచేయాలని కోరారు.దళిత క్రైస్తవులకు న్యాయమైన హక్కు దళిత హోదా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘా ప్రతినిధులు,రోమన్ క్యాదలిక్ శౌరయ్య, సీబీసీజేమ్స్, పాస్టర్ లు ప్రవీణ్, సమర్పణ కుమార్, మోసెస్, జాకబ్, ఫాదర్ జీవన్ కుమార్, చింత సుధాకర్, శ్రీను, యాకోబు, ప్రభుదాసు, రిటైర్డ్ హెచ్ఎంకొంపల్లి భక్షపతి, రిటైర్డు ఎస్సైఇటిక్యాల పాల్ రాజు, మాచర్ల గిరి ప్రకాశ్, మాగి జోసెఫ్, మేడి లక్మయ్య, సంజీవయ్య,దుబ్బ ప్రేమ్ కుమార్,ఆనందమయ్య, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బొంగు ప్రసాద్ గౌడ్ మాతృమూర్తి దశదిన కార్యక్రమంలో ప్రముఖుల నివాళులు

**చిన్నకొండూరులో అమ్మ యాదీ సభ నిర్వహణ --**

**మాతృమూర్తికి ఘన శ్రద్ధాంజలి**

చౌటుప్పల్, జ

చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్ గౌడ్ మాతృమూర్తి పదవ రోజు కార్యక్రమం అమ్మ యాదీ సభ రూపంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వివిధ సామాజిక, రాజకీయ, బహుజన మరియు గౌడ సంఘాల ప్రముఖులు హాజరై మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, మాతృమూర్తి జీవితకాలంలో కుటుంబ విలువలు, సామాజిక సేవా భావం, మానవీయతకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. వారి ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బహుజన నాయకులు విజిఆర్ నారగోని, నల్ల సూర్యప్రకాష్, హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ చలకాని వెంకట్ యాదవ్ బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసీ సురేష్, మహిళా నాయకురాలు సరస్వతి, హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర గీతా కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమట భూపాల్, మధు భూంపల్లి, రాకేష్ నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, స్థానిక గౌడ సంఘ నాయకులు గాయతి



జంగయ్య గౌడ్, గాయత్రి ముత్యాలు గౌడ్, బొంగు అంజన్ కుమార్ గౌడ్, చెరుకు రమేష్ గౌడ్, అదేవిధంగా నాయకులు పెద్దకొండూరు సర్పంచ్ ఇస్తారి యాదవ్, ప్రముఖ గౌడ సంఘ నాయకులు ముప్పిడి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొని తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు పాల్గొని మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



## బీ ఆర్ ఎస్ కార్యకర్త సాగని నిరంజన్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన బీ ఆర్ యస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్

దేవరకొండ జూన్ 1 (వార్తా వేదిక సూర్య):-

చందంపేటమండలం చిత్రియాల గ్రామనికి చెందిన బి ఆర్ ఎస్ కార్యకర్త సాగని నిరంజన్ మృత దేహాన్ని పూలమాల వేసి నివాళులు అర్పించిన బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్

ఆయన వెంట బి.ఆర్.ఎస్ పార్టీ చిత్రియాల సర్పంచ్ చాట్ల చిరంజీవి, బి.ఆర్.ఎస్ నల్ల చేల మూల సర్పంచ్ సత్య నారాయణ, సీనియర్ నాయకులు బోయన పల్లి రాములు గౌడ్, బి.ఆర్.ఎస్ మాజీ గ్రామ శాఖ అప్పల రామ లింగం, చిన్న అంజయ్య, బోయపల్లి రజిని కాంత్, సత్యనారి , ఎరుకల సత్యం, కండె వెంకటయ్య, తుమ్మల వెంకటయ్య నిరంజన్, తుమ్మల చెన్నయ్య, పాపయ్య, వార్డు సభ్యులు మార్క్ యాదయ్య, సామల ముత్తయా, సారయ్య, రాసునూరి బలరాములు, బోయపల్లి అంజయ్య, ఎరుకల సత్యనారయణ, ఎరుకల శ్రీధర్ గౌడ్, సాగని వేణు, తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశం చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ జూన్ 1 (వార్త వేదిక సూర్య):-





దేవరకొండ మండలం, శక్రు తండా గ్రామ పంచాయతీలో" తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ మరియు అధికారులతో కలిసి గృహప్రవేశం చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపడతామని చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసింది రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడుస్తున్న ఈ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తుంది. దేవరకొండ నియోజకవర్గంలోని ఇండ్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి వారి యొక్క ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## నిరంజన్ మృతి చాలా బాధాకరం

### బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్

దేవరకొండ జూన్ 1 (వార్త వేదిక సూర్య ):-



చందంపేట మండలం లోని చిత్రియల గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త సాగని నిరంజన్ మృతి చాలా బాధాకరం అని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అన్నారు నిరంజన్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన వెంట చిత్రియాల గ్రామ సర్పంచ్ చాట్ల చిరంజీవి ,సీనియర్ నాయకులు బోయన పల్లి రాములు గౌడ్, బి ఆర్ ఎస్ మాజీ గ్రామ శాఖ అప్పల రామ లింగం, చిన్న అంజయ్య, బోయపల్లి రజిని కాంత్, ఎరుకలి సత్యనారి గౌడ్, ఎరుకల సత్యం, కండె వెంకటయ్య, తుమ్మల వెంకటయ్య నిరంజన్, వార్డు సభ్యులు మార్క్ యాదయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు

# అత్యంత వైభవంగా ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన వేడుకలు







నల్లగొండ బ్యూరో, జూన్ 1 (వార్తా వేదిక సూర్య )

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేముల వీరేశం ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. సిఎం వేముల వీరేశం కి పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన వేడుకలు పెద్ద అంబర్‌పేటలోని నిధి కన్వెన్షన్ హాల్ లో అభిమానులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు కె. శ్రీనివాస్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి, మువ్వా విజయ్ బాబు, నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత తదితరులు పాల్గొని ఎమ్మెల్యే వేముల వీరేశం కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఆటో కార్మికుల ఆవేదన... కలెక్టర్ కు వినతి

నల్లగొండ బ్యూరో, జూన్ 1 (వార్తా వేదిక సూర్య )

మా పొట్టకొట్టొద్దు సార్ మా కుటుంబాలను రోడ్డున పడేయొద్దు.అంటూ నల్లగొండ పట్టణ ఆటో కార్మికులు కన్నీటి విజ్ఞప్తి చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. నల్లగొండ లో దాదాపు 5 వేల మంది ఆటో డ్రైవర్లు తమ కుటుంబాల జీవనోపాధి కోసం ఆటోలపై ఆధారపడుతుండగా, ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతో ఇప్పటికే ఆదాయం భారీగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో రాపిడో, ఓలా వంటి బైక్ టాక్సీ యాప్స్ కారణంగా ఆటోలకు వచ్చే ప్రయాణికులు మరింత తగ్గిపోయారని ఆరోపించారు."రోజంతా తిరిగినా డీజిల్, గ్యాస్ ఖర్చులు కూడా రావడం లేదని అన్నారు. ఇంటికి వెళ్లి పిల్లల ముఖాలు చూడలేని పరిస్థితి వచ్చింది అంటూ పలువురు డ్రైవర్లు కలెక్టర్ ముందే వాపోయారు.

పెరిగిన ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, కుటుంబ భారం నేపథ్యంలో స్థానిక కనీస ఆటో ఛార్జీని రూ.30 గా నిర్ణయించి, దానికి అధికారిక అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఆటో జేఏసీ నేతలు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి బైక్ టాక్సీల పై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో భారీ ఆందోళనలు తప్పవు అని హెచ్చరించారు.

# అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం





## తెలంగాణ అమరవీరులకు స్మృతి దీపం

## తెలంగాణ ఆస్తిత్వంపై కుట్రలు చేస్తే సహించం.

## ఉద్యమ నాయకులు పందుల సైదులు

నల్లగొండ బ్యూరో, జూన్ 1 (వార్తా వేదిక సూర్య )

అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని వారి త్యాగాలను నిరంతరం కొనియాడాల్సిన బాధ్యత తెలంగాణ సమాజం పై ఉందని వారు కలలుగన్న తెలంగాణ కోసం ముందుకు సాగాలిసిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమ నాయకులు, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి పుష్కరకాలం పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ పౌర సమాజ సంస్థలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేసి అమరుల స్మృతి దీపం పేరిట అమరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ నాయకులు పందుల సైదులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం వివిధ దశల్లో పనిచేసిన ఉద్యమ శక్తులు సంయుక్తంగా అమరుల స్మృతి దీపం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు.తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వేలాది మంది అమరవీరుల త్యాగాలను కొనియాడుతూ,త్యాగస్ఫూర్తిని గుర్తు తీసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చినది కాదని,విద్యార్థులు, యువత,ఉద్యోగులు,రైతులు,మహిళలు, వివిధ వర్గాల ప్రజల దశాబ్దాల పోరాటాలు,వేలాది మంది అమరుల ఆత్మబలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని అన్నారు. తెలంగాణ చరిత్రలో అమరవీరుల త్యాగాలు శాశ్వతంగా నిలిచిపోతాయని, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉద్యమకారులుగా మాపై ఉందన్నారు. అమరులు కలలుగన్న తెలంగాణ అంటే కేవలం ప్రత్యేక రాష్ట్రం మాత్రమే కాదని, దోపిడీ,పీడన,సామాజిక అసమానతలు,ప్రాంతీయ వివక్ష,నిరుద్యోగం, అన్యాయాలు లేని ప్రజాస్వామిక, సమానత్వ తెలంగాణ అన్నారు.తెలంగాణ ఏర్పడి పన్నెండు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ అమరవీరుల ఆశయాలకు అనుగుణమైన పాలన ఇంకా పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర అప్పులు ప్రస్తుతం ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయలను దాటినప్పటికీ అభివృద్ధి ఫలాలు సాధారణ ప్రజలకు సమానంగా అందడం లేదన్నారు. అభివృద్ధి పేరుతో హైదరాబాద్ నగరానికే ప్రాధాన్యత ఇస్తూ, మిగతా జిల్లాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందన్నారు.తెలంగాణ ఉద్యమం లక్ష్యం కేవలం ఒక నగర అభివృద్ధి కాదని,రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి జిల్లా సమానంగా అభివృద్ధి చెందడమేనని స్పష్టం చేశారు.వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి, పరిశ్రమలు మరియు సామాజిక సంక్షేమ రంగాలలో సమగ్ర అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయడం, ప్రభుత్వ విద్యా మరియు వైద్య వ్యవస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన నాటి నుండి నేటి వరకు సమైక్యవాద భావజాలంతో పనిచేసే శక్తులు, తెలంగాణ వ్యతిరేక రాజకీయ శక్తులు, తెలంగాణ అస్తిత్వాన్ని అంగీకరించలేని వర్గాలు రాష్ట్ర స్వాభిమానాన్ని దెబ్బతీయడానికి వివిధ రూపాల్లో కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

తెలంగాణ భాష, సంస్కృతి, చరిత్ర, రాజకీయ అస్తిత్వం, స్వయంపాలన భావనలను బలహీనపరిచే ప్రయత్నాల పట్ల తెలంగాణ సమాజం అప్రమత్తంగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ అస్తిత్వం అనేది కేవలం భౌగోళిక సరిహద్దుల ప్రశ్న కాదని, అది స్వాభిమానం, స్వయంపాలన, సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తెలంగాణపై విషపూరిత సమైక్య శక్తులు అనవసరమైన ప్రేలాపనలు చేస్తే చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేమన్నారు.తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు చేస్తే తెలంగాణ సమాజం మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అంటే,వారు కలలుగన్న తెలంగాణ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేయడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు.

అమరుల స్మృతి దీపం కార్యక్రమం తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని సజీవంగా ఉంచడంతో పాటు భావితరాలకు తెలంగాణ చరిత్రను పరిచయం చేసే ప్రజా చైతన్య కార్యక్రమంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన వరకు ప్రజాస్వామ్య పంథాలో పోరాటాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.అమరుల త్యాగం తెలంగాణకు పునాది అని వారి ఆశయాల సాధనే వ నిజమైన నివాళి అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బోనగిరి దేవేందర్,చీర పంకజ్ యాదవ్,,దూసరి కిరణ్ కుమార్, చింతమల్ల గురువయ్య, కే.పర్వతాలు,ఇందూరి సాగర్,ఆర్.విజయ్ కుమార్, పి.ఏడుకొండలు, మల్లేశం ఆర్ లక్ష్మయ్య,పెండెం ధనుంజయ నేత, వెంకటేశ్వర్లు,బీవీ చారి, గద్దపాటి సురేందర్, కే.రత్నయ్య, సునీత,గూడూరి జానకిరామ్ రెడ్డి,అయితగోని జనార్దన్ గౌడ్,మాతంగి అమర్,బట్టు నవీన్,కొండేటి మురళి, తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నల్గొండ జిల్లా అధ్యక్షుని గా సిద్ధం వెంకన్న



నల్లగొండ బ్యూరో, జూన్ 1 (వార్తా వేదిక సూర్య )

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నల్గొండ జిల్లా కన్వీనర్ గా పనిచేస్తున్న సిద్ధం వెంకన్న కు పదోన్నతి కల్పిస్తూ జిల్లా అధ్యక్షునిగా నియమిస్తున్నట్లు. జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా సిద్ధం వెంకన్న మాట్లాడుతూ..జాతీయ అధ్యక్షులైన డాక్టర్ చంటి ముదిరాజ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూన్నాను. జాతీయ, రాష్ట్ర కమిటీ మెంబర్స్ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నల్లగొండ జిల్లా లో ఆర్ టి ఐ ని ముందుకు తీసుకుపోతూ జిల్లాలో అందరికీ సమాచార హక్కు చట్టం గురించి తెలియపరుస్తానని హామీ ఇస్తున్నాను అన్నారు. అలాగే వివిధ జిల్లా లలో పదోన్నతి పొందిన ఆర్టిఏ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే ను కలిసిన దోర్నాల ఆంజయ్య, భరద్వాజ్



గట్టుప్పల.జూన్ 1.వార్త వేదిక సూర్య:

మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 59 వ జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు దోర్నాల ఆంజయ్య భరద్వాజ్ నేత రాజగోపాల్ రెడ్డిని కలసి వారిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సంపుటి : 2 సంచిక: 13 వార్త వేదిక సూర్య హైదరాబాద్ మంగళవారం, జూన్ 02, 2026



# అత్తాపూర్ సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమం

## డిప్యూటీ కమిషనర్ ఎల్.పీ. మల్లయ్య ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ

**రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎల్.పీ. మల్లయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న డిప్యూటీ కమిషనర్, సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్ర మంలో మొత్తం ఒక దరఖాస్తు అందగా, దానిని పరిశీలించి తగిన చర్యల కోసం సంబంధిత అధికారులకు పంపించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఎల్.పీ. మల్లయ్య మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని పారదర్శకంగా పరిశీలించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

# అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ: నిరుడు శేఖర్ ముదిరాజ్

## - పార్లమెంట్‌లో సుష్మా స్వరాజ్ చిన్నమ్మ పాత్ర మరువలేనిది

**రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :**



జూన్ 2న జరుపుకునే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం కోట్లాది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ అన్నారు. దశాబ్దాల పాటు సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని, వారి అమరత్వమే నేటి స్వరాష్ట్ర సాకారానికి పునాది అని కొనియాడారు. తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక పాత్ర పోషించిందని శేఖర్ ముదిరాజ్ గుర్తుచేశారు. నాడు పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా ఉన్న మాజీ కేంద్ర మంత్రి దివంగత సుష్మా స్వరాజ్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను బలంగా వినిపించారని కొనియాడారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యం.. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలి అంటూ ఆమె చేసిన సింహగర్జన ఉద్యమకారుల్లో కొత్త ఆశలు నింపిందన్నారు. నాటి పార్లమెంట్‌లో బీజేపీ గనుక గళం విప్పకపోయి ఉంటే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు మరింత ఆలస్యమయ్యేదని ఆయన అభిప్రాయ పడ్డారు.అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా యువతకు ఉపాధి, రైతులకు భరోసా, పేదలకు సంక్షేమం అందే నిజమైన ప్రజాస్వామ్య తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## నార్సింగిలో దళిత భూములపై కబ్జా యత్నం.. జిల్లా కలెక్టర్‌కు దళితుల ఫిర్యాదు

**రాజేంద్రనగర్, జూన్ 01 (వార్త వేదిక సూర్య ) :**



నార్సింగి ప్రాంతంలోని దళితులకు కేటాయించిన భూములపై కొందరు బడా బాబులు కన్నేశారని, ప్రభుత్వ బోర్డుపై ఉన్న రాతలను చెరిపివేసి భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని స్థానిక దళితులు ఆరోపించారు. ఈ మేరకు బాధితులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.దళితుల వాదన ప్రకారం, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములకు సంబంధించిన గుర్తింపు బోర్డులపై ఉన్న వివరాలను కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తొలగించి, భూముల యాజమాన్యంపై సందిగ్ధత సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీంతో భూముల భద్రతపై ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, దళితులకు చెందిన భూములను రక్షించాలని, కబ్జా యత్నాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూములపై పూర్తి స్థాయి విచారణ జరిపి, ప్రభుత్వ రికార్డుల ప్రకారం హక్కుదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఫిర్యాదును స్వీకరించిన జిల్లా అధికార యంత్రాంగం సంబంధిత అంశంపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ డా.హేమ సామల



**సికింద్రాబాద్, జూన్ 01(వార్త వేదిక సూర్య)**
మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల అన్నానగర్ ప్రాంతంలో జరుగుతున్న నాలాల మట్టి పూడికతీత పనులను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నాలాల శుభ్రపరిచే పనులు చేపట్టినట్లు తెలిపారు. నాలాల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని పూర్తిస్థాయిలో తొలగించడం ద్వారా వర్షపు నీరు సాఫీగా వెళ్లి ఇండ్లలోకి నీరు చేరుట సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రతి ప్రాంతంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం అవసరమని ఆమె అన్నారు.అనంతరం ఉప్పర్ బస్తీ మరియు బ్రాహ్మణబస్తీ ప్రాంతాల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే ముఖ్యంగా వర్షాకాలంలో బురద, గుంతల సమస్యల నుంచి ప్రజలకు ఉపశమనం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకుండా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న వాటర్ లైన్ పనులను కూడా పరిశీలించిన డా. సామల హేమ, ప్రజలకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వాటర్ లైన్ పనుల వల్ల ప్రజలకు తాత్కాలిక అసౌకర్యం కలిగినా, భవిష్యత్తులో దీర్ఘకాలిక ప్రయోజనాలు అందుతాయని చెప్పారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని డా. సామల హేమ తెలిపారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుషాల్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్,బి అర్ ఎస్ నాయకులు లక్ష్మి,గగన తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

## లక్ష్మిగూడలో విషాద ఘటన.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :**
తేదీ 01 సోమవారం ఉదయం 6:30 గంటల సమయంలో లక్ష్మిగూడకు చెందిన బండారి మౌనిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ప్రకారం, ఆమెకు సుమారు 10 సంవత్సరాల క్రితం శ్రీ సాయిలుతో వివాహం జరగగా, ఇద్దరు పిల్లలతో కలిసి లక్ష్మిగూడ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త శ్రీ సాయిలు (35) గత పది సంవత్సరాలుగా వస్త్ర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వ్యాపారం సరిగా నడవక అప్పుల పాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో మే 31వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో దుకాణం మూసివేసి ఇంటికి వచ్చిన సాయిలు తన పడకగదిలోకి వెళ్లాడు. కొంత సమయం తర్వాత పిలిచేందుకు వెళ్లగా తలుపు మూసి ఉండటంతో పాటు ఎలాంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. వెంటనే బంధువుల సహాయంతో తలుపు తెరిచి చూడగా, గదిలోని కిటికీ ఇనుప రాడుకు చున్నీతో ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారంతో మనస్తాపానికి గురై తన భర్త ఈ దారుణ నిర్ణయం తీసుకున్నాడని భార్య మౌనిక తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు పోలీసులు నేర సంఖ్య 565/2026గా నమోదు చేసి, భారతీయ నాగరిక భద్రతా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మణికొండ -- పుప్పాలగూడ -- నెక్నాంపూర్ ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ నాయకుడు బి. ఉపేంద్రనాథ్ రెడ్డి ఆవేదన

**రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాల ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి. ఉపేంద్రనాథ్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులు, అభివృద్ధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలులో ఈ ప్రాంతాల ప్రజలు వివక్షకు గురవుతున్నారని ఆయన ఆరోపించారు.మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 80 వేల మంది ఓటర్లు ఉన్నప్పటికీ కేవలం రెండు కార్పొరేటర్ స్థానాలు మాత్రమే కేటాయించడం ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో నార్సింగ్ ప్రాంతంలో సుమారు 35 వేల మంది ఓటర్లు ఉండగా మూడు కార్పొరేటర్ స్థానాలు కేటాయించడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పుప్పాలగూడ ప్రాంత ప్రాధాన్యతను తగ్గించే విధంగా తీసుకుంటున్న నిర్ణయాలు అక్కడి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీస్తున్నాయని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల విషయంలో కూడా స్పష్టమైన అసమానత కనిపిస్తోందని బి. ఉపేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. నార్సింగ్ ప్రాంతంలో 198 మంది లబ్ధిదారులకు అవకాశం కల్పించగా, మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాలను కలిపి కేవలం 100 మందికి మాత్రమే అవకాశం ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల ప్రజల పట్ల ప్రభుత్వం ఎందుకు వివక్ష చూపుతోందో ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రతి పౌరుడిని సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఆయన అన్నారు. ఒక ప్రాంతానికి అధిక ప్రాధాన్యత, మరో ప్రాంతానికి నిర్లక్ష్యం చూపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం విధించే అన్ని పన్నులు సమానంగా చెల్లిస్తున్న ప్రజలకు సంక్షేమ పథకాల పంపిణీలో, రాజకీయ ప్రాతినిధ్యంలో ఎందుకు అసమానతలు చూపుతున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు.ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం జరుగుతున్న సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన నాయకులు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా, ప్రజల సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత కూడా నాయకులపై ఉందని గుర్తు చేశారు.మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ ప్రాంతాల ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగు తుందని,



ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని బి. ఉపేంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు.



# ఆరాంఘర్--జూ పార్క్ సర్వీస్ రోడ్ల పనులను వేగవంతం చేయాలి

## : జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :**
ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూ పార్క్ వరకు ఫ్లైఓవర్ కింద ఇరువైపులా కొనసాగుతున్న సర్వీస్ రోడ్లు, ర్యాంపుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఉదయం అధికారుల బృందంతో కలిసి ఆయన ఆరాంఘర్--జూ పార్క్ మార్గాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫ్లైఓవర్ కింద ఇరువైపులా నిర్మాణంలో ఉన్న సర్వీస్ రోడ్ల పురోగతిని సమీక్షించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

అలాగే ర్యాంపుల నిర్మాణ పనుల నాణ్యతను కాపాడుతూ నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, యూబీడీ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# నర్కుడలో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు

## - లబ్ధిదారులతో కలిసి కొత్త ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## - 'అందరికీ ఇల్లు -- సురక్షిత నివాసం' లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు: ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :**





తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల గృహప్రవేశాల ఉత్సవం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభోత్సవ ఫీతా కత్తిరించి, సాంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారుల కుటుంబాలకు నూతన గృహాలను అందజేశారు.ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు నిర్వహించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో 3,144 ఇళ్లను లబ్ధిదారులకు అందించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.అందరికీ ఇల్లు -- సురక్షిత నివాసం లక్ష్యంతో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు, గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, కొత్త ఇంటిలో అడుగుపెట్టిన ప్రతి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సొంత ఇంటి కల సాకారమైన సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సంపుటి : 2 సంచిక: 13 వార్త వేదిక సూర్య హైదరాబాద్ మంగళవారం, జూన్ 02, 2026



# రాజేంద్రనగర్‌లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం విజయవంతం

### - శివరాంపల్లి ప్రజాభవన్‌లో సార్ అమలు, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై చర్చ

రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి ప్రజాభవన్‌లో భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ ప్రోగ్రామ్) అమలు విధానం, పార్టీ భవిష్యత్ కార్యాచరణతో పాటు రాబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి కీలక సూచనలు చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి వరకు సమర్థవంతంగా తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి, జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గోల్కొండ జిల్లా ఇన్‌చార్జ్ వై. శ్రీధర్, ఆర్ఆర్ జిల్లా కార్యదర్శి పి. మల్లేష్, కె. సోల్కర్ రెడ్డి (ఎస్ఐఆర్), జోగు రవి, సదానంద్, హరికిషన్ జీ, బండారి బాలకృష్ణ, సమ రాహుల్ రెడ్డి, రాజేంద్రనగర్ జనరల్ సెక్రటరీ ఎస్. రాజశేఖర్ రెడ్డి, పద్మావతి, కవిత తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాత్రి కాలనీ పార్కు అభివృద్ధికి వినతి

### జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన స్థానికులు

రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని 122వ డివిజన్ ధాత్రి కాలనీ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతూ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎం. నవీన్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక కాలనీ సభ్యులు సోమవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌తో పాటు పిల్లలు, వృద్ధుల కోసం అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పార్కును ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సమస్యను పరిశీలించి త్వరలోనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. కమిషనర్ సానుకూల స్పందనతో ధాత్రి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం, వినోదం మరియు వ్యాయామ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మల్కాజిగిరి నియోజకవర్గ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి తో మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ భేటీ

సికింద్రాబాద్, జూన్ 01(వార్త వేదిక సూర్య)



మల్కాజిగిరి నియోజకవర్గ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ను సోమవారం మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రానున్న వర్ష కాలం దృష్టిలో పెట్టుకొని డివిజన్ పరిధిలోని పారిశుధ్య సమస్యలు నాలాల పూడికతీత మరియు రోడ్ల సమస్యలపై వినతి పత్రం అందచేశారు. దినికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు మాజీ కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఉన్నారు.

# భావితరాలకు భారతీయ సంస్కృతి అందించడం మన కర్తవ్యం






### - మధుబన్ కాలనీలో అంగరంగ వైభవంగా 'హిందూ సమ్మేళనం'
### -వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. మార్మోగిన జై శ్రీరామ్ నినాదాలు
### - ధర్మ పరిరక్షణ, జాతీయ చైతన్యమే లక్ష్యం: పూజ్య శ్రీ దుర్గానందపురి స్వామీజీ
### - హిందూ సమాజ ఐక్యతే దేశ బలం: కాసుల మానస

మైలర్ దేవ్‌పల్లి, వార్త వేధిక సూర్య

అత్తాపూర్ సర్కిల్, మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ శ్రీ రామకృష్ణ హైస్కూల్ సర్కిల్ వద్ద నిర్వహించిన హిందూ సమ్మేళనం అంగరంగ వైభవంగా, అత్యంత భక్తి శ్రద్ధలతో, వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణ, భారతీయ సంస్కృతి పరిరక్షణ, యువతలో జాతీయ చైతన్యం పెంపొందించడం, సమాజంలో ఐక్యత మరియు సామరస్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ మహాసమ్మేళనం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీలో , యువకులు,జై శ్రీరామ్ నినాదాలు, దేశభక్తి గీతాలు, భక్తి గీతాలతో మధుబన్ పరిసర ప్రాంతాలు ధర్మచైతన్యంతో మార్మోగాయి. హిందూ సమాజ ఐక్యతకు ప్రతీకగా సాగిన ఈ బైక్ ర్యాలీ ప్రజల్లో విశేష ఉత్సాహాన్ని నింపింది. సాయంత్రం 6 గంటలకు నిర్వహించిన హిందూ సమ్మేళన సభలో ముఖ్య అతిథులుగా పూజ్య శ్రీ శ్రీ శ్రీ దుర్గానందపురి స్వామీజీ (శ్రీమత్ అన్నపూర్ణేశ్వరి కాశీ విశ్వనాథ పీఠాధిపతులు), విశ్వహిందు మాస పత్రిక సంపాదకులు ఆచార్య కాసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, జాతీయ భావజాలంపై ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు.

పూజ్య శ్రీ శ్రీ శ్రీ దుర్గానందపురి స్వామీజీ మాటల్లో:

ధర్మాన్ని రక్షించడం అంటే కేవలం ఆచారాలను కాపాడుకోవడం కాదు, మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, జాతి గౌరవాన్ని పరిరక్షించడం. సమాజంలో ఐక్యత, సేవాభావం, దేశ భక్తి పెరిగినప్పుడే బలమైన భారతదేశం నిర్మిత మవుతుంది. ఆచార్య కాసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి ప్రపంచానికి మార్గదర్శకమని, యువత తమ మూలాలను గుర్తుంచుకొని ధర్మం, సంస్కృతి, జాతీయత పట్ల అం కితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర సేవికా సమితి భాగ్యనగర్ విభాగ్ శారీరక్ ప్రముఖ్, న్యాయవాది కాసుల మానస మాట్లాడుతూ.. హిందూత్వం అనేది కేవలం మతపరమైన భావన కాదని, ఈ దేశ ఆత్మ, సంస్కృతి, నాగరికతకు ప్రతీక అని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన హిందూ సమాజం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో ప్రతి హిందువు తన సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక విలువల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో విభజనలను సృష్టించే శక్తుల పట్ల జాగ్రత్తగా ఉ ండాలని, హిందూ సమాజ ఐక్యతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. "హిందూ సమాజం బలంగా ఉంటేనే దేశం బలంగా ఉ ంటుంది. కుటుంబ వ్యవస్థ, సంస్కృతి, సనాతన విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని స్పష్టం చేశారు. మహిళలు కేవలం కుటుంబ నిర్వహణకే పరిమితం కాకుండా సమాజ జాగృతికి, సంస్కృతి పరిరక్షణకు ముందుండాలని ఆమె అన్నారు. ప్రతి ఇంటిలో దేశభక్తి, ధర్మనిష్ఠ, సంస్కార విలువలు పెంపొందినప్పుడే బలమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

"మన సంస్కృతిని మనమే కాపాడుకోకపోతే మరెవ్వరూ కాపాడలేరు. భావితరాలకు భారతీయతను, సనాతన ధర్మ విలువలను అందించడం మనందరి కర్తవ్యం అని కాసుల మానస పిలుపునిచ్చారు. ఈ మహాసమ్మేళనంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు, యువత ప్రదర్శించిన భక్తి నృత్యాలు, దేశభక్తి గేయాలు, భారతీయ సంస్కృతిని చాటిచెప్పే కళాప్రదర్శనలు మరియు నాటికలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రతి ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి ఘన స్పందన లభించింది. కమిటీ అధ్యక్షులు బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, హిందూ సమాజంలో ఐక్యత, సేవా భావం, సంస్కృతి పరిరక్షణ, యువతలో జాతీయ చైతన్యం పెంపొందించడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమాజ హితం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయడంలో కమిటీ అధ్యక్షులు బొల్లా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దానోజు శ్రీనివాస్, కోశాధికారి అడికే కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి, సీతారాం పాండు, దొంత రాజు, జాయింట్ సెక్రటరీలు ఉత్తమ్, బాలస్వామి, రాజవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్, ఉప కోశాధికారి చైతన్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గంజి వెంకటేష్, ఏలప్ప, సతీష్, మీడియా కోఆర్డినేటర్లు నంద కిషోర్, విజయ్, కల్చరల్ కోఆర్డినేటర్లు లక్ష్మి, గాయత్రీ, సలహాదారులు మసున వెంకటేష్, మునిగిపాటి చంద్రయ్య, కాశీగారి యాదగిరి,గోవింద్ రాజ్, సామల యాదయ్య, మహిపాల్, పోశెట్టి, మొగిలి కృష్ణ భాశెట్టి వెంకటేశ్వర్ రావు తో పాటు వందలాది మంది స్వచ్ఛంద సేవకులు అహర్నిశలు శ్రమించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆర్టీసీ విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి



### - రాజేంద్రనగర్ డిపోలో కార్మికుల డిమాండ్స్ డే

రాజేంద్రనగర్, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ) :

ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజేంద్రనగర్ బస్ డిపో ముందు సోమవారం కార్మికులు డిమాండ్స్ డే నిర్వహించి నిరసన తెలిపారు. డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ సమస్యల పరిష్కారాన్ని కోరారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్. కృష్ణ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడమేనని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విలీన ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు. విలీన ప్రక్రియలో కార్మికులకు ఎలాంటి నష్టం జరగకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలవెన్సుల పెంపుపై వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని, జూనియర్ అసిస్టెంట్లతో పాటు అన్ని కేటగిరీల ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే విలీన కమిటీలో ఆర్టీసీలోని అన్ని గుర్తింపు పొందిన సంఘాల ప్రతినిధులకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ పథకాలను విలీనం అనంతరం కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. విలీన ప్రక్రియకు ముందే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డిపో నాయకులు ఎం. సూర్య నాయక్, బాలయ్య, జైపాల్, స్వామి, పాండు తదితరులు పాల్గొన్నారు. కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు.



# రోజులో 30 నిమిషాల రన్ హాస్పటల్ కు దూరం చేస్తుంది

### మే నెల మొత్తం 31 డేస్ 21 కిలోమీటర్ల రన్. ఇంటలిజెన్స్ ఐసీసీసి ఇన్స్పెక్టర్ దుబ్బాకిషన్.

నాగారం జూన్ 1 ( వార్త వేదిక సూర్య )

ఆరోగ్యానికి రన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి రోజు ఒక 30 నిమిషాలు రన్నింగ్ కానీ, వాకింగ్ గాని చేసినట్లయితే ఎవ్వరికీ కూడ ఆసుపత్రి కి పోవాల్సిన అవసరం ఉండదని ఇంటలిజెన్స్ ఐ సి సి సి ఇన్స్పెక్టర్ దుబ్బాకిషన్ తెలిపారు. చెంగిచెర్ల శాంతివనం రన్నర్స్ గ్రూప్ లో సభ్యుడు అయిన దుబ్బ కిషన్ మే నెల 1 వ తేదీ నుండి 31 వరకు ప్రతి రోజు 21.1 కి మీ పరుగును పూర్తి చేసిన ఇన్స్పెక్టర్ దుబ్బ కిషన్ ను శాలువా తో ఉప్పల్ భగాయత్ లో ఎల్బీనగర్ రన్నర్స్ మరియు ఉ ప్పల్ రన్నింగ్ గ్రూప్ సభ్యులు సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ దుబ్బ కిషన్ మాట్లాడుతూ నేను 2012 నుండి రన్ ను ప్రారంభించడం జరిగింది. 2021 లో ఎయిర్టెల్ మారథాన్ తో పరుగు పోటీ లలో పరుగు ప్రారంభించి ఇప్పటి వరకు 12 ఫుల్ మారథాన్ (42.192 కి మీ) ను,25 హాఫ్ మారథాన్ పూర్తి చేయడం జరిగింది . ఈ సంవత్సరం మే 1 వ తేదీ నుండి 31 వరకు మొత్తం 31 రోజులు ప్రతి రోజు 21.1 కి మీ పరుగును పూర్తి చేశాను. ఈ పరుగును పూర్తి చేయడానికి శాంతి వనం రన్నర్ గ్రూప్ సభ్యులు ఎంతగానో ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ పరుగును పూర్తిచేసిన నన్ను కొంతమంది అయినా ఆదర్శంగా తీసుకొని పరుగు ను ప్రారంభిస్తారు అని ఆశిస్తున్నాను. ముఖ్యంగా ఇలాంటి పరుగు లో పాల్గొనాలంటే ఎవరి ఆరోగ్య పరిస్థితులను వారు దృష్టిలో పెట్టుకొని తమకు సాధ్యమైనంత వరకు మాత్రమే పరుగు చేయాలని సూచించారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, జూన్ 01(వార్త వేదిక సూర్య)



ప్రజల సమస్యలను పరిష్కరించడమే నా లక్ష్యమని మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని నాలా బజార్‌ను సందర్శించి కొనసాగుతున్న వర్షపు నీటి కాలువ పైపుల ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం డంపింగ్ యార్డ్‌గా మారిన జైలు ఖానా పార్కింగ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్ తదితరులున్నారు.

# రాయదుర్గంలో ఎకరం రూ. 204 కోట్లు

### టీజీఐఐసీ భూముల వేలంలో పలికిన ధర ఖర్చులకు పైసల్లేవంటున్న ఆర్థిక మంత్రి భట్టి

హైదరాబాద్, జూన్ 1 ( వార్త వేదిక సూర్య ) :

భూముల వేలం ద్వారా సర్కారుకు భారీగా ఆదాయం సమకూరుతున్నప్పటికీ అప్పులు చేస్తున్నది. రాబడి లేదు.. ఖర్చులకు పైసల్లేవని ఏకంగా ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క సెలవిచ్చారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషనే లిమిటెడ్(టీజీఐఐసీ) రాయదర్గంలో నిర్వ హించిన భూముల వేలంలో ఎకరం రూ.204కోట్లు ధర పలికింది. సోమవారం రంగారెడ్డి జిల్లా రాయదుర్గంలోని 83/1 సర్వే నంబర్‌లోని 5.09 ఎకరాల భూమికి టీజీఐఐసీ వేలం నిర్వహించగా, ఎకరం రూ.204కోట్లకు ధర పలుకగా.. 5.09 ఎకరాలకు రూ.1020 కోట్ల ఆదాయం సమకూరినట్టు అధికారులు వెల్లడించారు. రెండురోజుల క్రితం ఇక్కడ నిర్వహించిన వేలంలో ఎకరం రూ.237 కోట్ల రికార్డు ధర పలికిన విషయం తెలిసిందే. 6.29 ఎకరాల భూమి వేలంగా వేయగా, ప్రభుత్వానికి రూ.1,490 కోట్లు ఆదాయం సమకూరింది.

# ఇందిరమ్మ ఇండ్లు పేదలకు వరం



యాదాద్రి భువనగిరి/వార్త వేదిక సూర్య : ఇందిరమ్మ ఇండ్లు ప్రతి పేద కుటుంబానికి వరం లాంటిదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నీ ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేగూరి మల్లేశం గ్రామస్తులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా టేకులసోమారం గ్రామానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు గ్రామానికి ఎక్కువ సంఖ్యలో కేటాయించి ఇండ్లు లేని పేదల చిరకాల కోరిక తీర్చాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రెండవ విడతలో గ్రామానికి సరిపడ ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తానని హామీ ఇచ్చాడు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో గ్రామశాఖ అధ్యక్షులు నారగోని పాండు, వార్డు సభ్యులు రత్నమ్మ, యాదయ్య, మల్లేష్, నాయకులు బాలరాజు, అంజి, పరమేష్, బాలు తదితరులు ఉన్నారు.

## మునుగోడు క్యాంప్ కార్యాలయం రక్తదానం చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



మోత్కూరు, జూన్ 01 ( వార్త వేదిక సూర్య): మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదినాన్ని సోమవారం పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ నాయకులు అవిశెట్టి కిరణ్, బోల్లెపల్లి శ్రావణ్ లు రక్తదానం చేశారు.

## మున్సిపల్ సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేత



మోత్కూరు, జూన్ 01 ( వార్త వేదిక సూర్య): మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామంలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి 3,4 వాడు కౌన్సిలర్లు సుల్తాన్ స్వామి, కొండ శోభ సోంమల్లు నూతన వస్త్రాలు, సబ్బులు, కొబ్బరినూనె ఇతర సామాగ్రిని సోమవారం అందజేశారు.

## పేదలకు సొంతింటి కల నెరవేర్చమే ప్రభుత్వ లక్ష్యం

- 8వ వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి



మోత్కూరు, జూన్ 01 ,( వార్త వేదిక సూర్య,): పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని 8వ, వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు సూరారపు అనసూయ రఘువేల్ గృహప్రవేశాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన బారాస ప్రభుత్వం పేదలకు ఇండ్ల నిర్మాణాలను చేపట్ట లేకపోయిందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వ సహాయం లోనే పేదలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులు అనసూర్య రఘు-వెల్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇంటి నిర్మాణం చేపట్టాలనుకున్న తమ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ద్వారా నెరవేర్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అవిశెట్టి రాజు, జవ్వాది అనిత, బండారు వెంకటరెడ్డి, లోడే రాజు, బుర్ర మత్స్యగిరి, వార్డు ఆఫీసర్ గుర్రం సాయి సుప్రియ, మున్సిపల్ సిబ్బంది బుర్ర రాము ఎడ్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు. దాచారంలో.. .... . మండలంలోని దాచారం గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న శ్రీరాముల అనూష, నవీన్ ఇందిరమ్మ గృహప్రవేశాన్ని ఆ గ్రామ సర్పంచ్ కర్నే జ్యోతి, వీరేశం సోమవారం ప్రారంభించారు. అనంతరం గృహప్రవేశం చేసిన దంపతులకు శాలువాలతో సర్పంచ్ సన్మానించారు. పాటిమట్ల లో...... మండలంలోని పాటిమాట్ల గ్రామానికి చెందిన బట్టు లక్ష్మి ఇందిరమ్మ ఇంటి గృహప్రవే శాన్ని స్థానిక సర్పంచ్ బండ రమ విజయ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండబోయిన సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. దతప్పగూడెంలో........ మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు శ్రీలత రాణి గృహప్రవేశాన్ని గ్రామ సర్పంచ్ గుండు యాదగిరి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లక్ష్మణ చారి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. 9వ వార్డులో...... మున్సిపల్ పరిధిలోని గడి బజారుకు చెందిన మరాఠీ లావణ్య వెంకన్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని వార్డు కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ గౌడ్ సోమవారం ప్రారంభించారు.

# పేదలకు వరంగా మారిన 'ఇందిరమ్మ ఇండ్లు'

- నాంచారిపేటలో ఇండ్ల ప్రారంభోత్సవం!
- రెండో విడతలో మరో 40 ఇండ్లు మంజూరు చేయాలని సర్పంచ్ బెల్లి మల్లేశం డిమాండ్!





మోటకొండూరు, జూన్ 1 (వార్త వేదిక సూర్య): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం సమాజంలోని నిరుపేదలకు ఒక గొప్ప వరంగా మారిందని నాంచారిపేట గ్రామ ప్రజాప్రతినిధులు కొనియాడారు. మండల పరిధిలోని నాంచారి పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ బెల్లి మల్లేశం మరియు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు కల్లూరు సత్యనారాయణ లు రిబ్బన్ కట్ చేసి ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాంచారిపేట గ్రామంలో మొదటి విడత కింద మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూనే.. గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదలు ఇంకా చాలా మంది ఉన్నారని గుర్తు చేశారు. కాబట్టి అర్హులైన మిగతా లబ్ధిదారుల కోసం నాంచారిపేట గ్రామానికి రెండో విడతలో భాగంగా మరో 40 ఇండ్లను మంజూరు చేయాలని వారు ఈ వేదిక ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అధికారిక కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఉప సర్పంచ్ గంధమల్ల రేణుక, వార్డు సభ్యులు కప్పే సబితా, గంధమల్ల స్వప్న, గందమల్ల లక్ష్మి, పోతగాని వెంకటేశ్వర్లు, వరికుప్పల కవి గ్రామపంచాయతీ కారోబార్ గంధమల్ల బిక్షపతి, జీపీ సిబ్బంది గంధమల్ల రవి, కోళ్ల రేణుక మరియు గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు కూలీ సంఘం రాష్ట్ర సభలను విజయవంతం చేయాలి

- బోనాల స్వామి

సిద్దిపేట, జూన్ 1(వార్త వేదిక సూర్య): రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనాల స్వామి పిలుపునిచ్చారు. రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆదివారం సిద్దిపేట జిల్లా ప్రెస్ క్లబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను వ్యతిరేకించాలని అన్నారు. అడవులు, భూములు, ఖనిజాలు, నీటి వనరులు, గుట్టలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాస్వామిక శక్తులు పెద్ద ఎత్తున రాష్ట్ర సభల్లో పాల్గొని వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సు హైదరాబాద్‌లోని కాచిగూడ తుల్జాభవన్‌లో జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ (విజృంభన) జిల్లా కన్వీనర్ పోచంపల్లి రాజేష్, రాష్ట్ర నాయకులు విష్ణు, ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక కన్వీనర్ వంగల సంతోష్, డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్(డిఎంజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర్ నాథ్.ఎల్ ఏఐఎఫ్టీయు రాష్ట్ర కమిటీ సభ్యులు మహమ్మద్ షాదుల్లా, రైతు కూలీ సంఘం నాయకులు ఏం. ఏల్లం మేకల రాములు, బాలన్న, మహేందర్, నాంపల్లి, తదితరులు పాల్గొన్నారు.





# కొల్లూరు మదర్ డైరీ చైర్మన్‌గా ఐలి కృష్ణ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక

పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని వెల్లడి!



ఆలేరు, జూన్ 1(వార్త వేదిక సూర్య): ఆలేరు మండల పరిధిలోని కొల్లూరు గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం (మదర్ డైరీ) నూతన చైర్మన్‌గా ఐలి కృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కొల్లూరు గ్రామ పాల సంఘ భవనంలో పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదిస్తూ ఐలి కృష్ణ గౌడ్‌ను నూతన చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఐలి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మదర్ డైరీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘ డైరెక్టర్లకు, పాడి రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కొల్లూరు పాల ఉత్పత్తిదారుల సంఘం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని, అలాగే గ్రామంలోని పాడి రైతుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ ఏకగ్రీవ ఎన్నిక పట్ల గ్రామస్తులు, పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# భూస్వాముల పెత్తందారీతనంపై పోరాడిన యోధుడు

- వర్ధూరులో కామ్రేడ్ గట్టికొప్పుల లింగయ్య 5వ వర్ధంతి
- ఘనంగా నివాళులు



మోటకొండూరు, జూన్ 01 (వార్త వేదిక సూర్య): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అహర్నిశలు పోరాడిన వీరుడు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కీర్తిశేషులు కామ్రేడ్ గట్టికొప్పుల లింగయ్య 5వ వర్ధంతి వేడుకలు మండల పరిధిలోని వర్ధూరు గ్రామంలో సోమవారం ఘనంగా జరిగాయి. భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ శాఖ, మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం ముఖ్య అతిథిగా హాజరై, లింగయ్య స్మారక స్థూపానికి పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాదగాని మాణిక్యం మాట్లాడుతూ.. బడుగు, బలహీన, నిరుపేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా జీవించిన కామ్రేడ్ లింగయ్య.. 1946-1951 మధ్య కాలంలో తన 18 సంవత్సరాల చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై సభ్యత్వం తీసుకున్నారన్నారు. గ్రామస్థాయిలో రైతు సభలను నిర్వహించి, రైతులందరినీ సంఘటితం చేసి నైజాం పాలకుల దోపిడీకి, భూస్వాముల పెత్తందారీతనానికి వ్యతిరేకంగా తుపాకీ పట్టి పోరాడారని కొనియాడారు. ఆనాడు నిరుపేదలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను భూశిస్తు, పన్నుల పేరిట నిలువునా దోచుకుంటున్న పాలకుల గుండెల్లో రైల్వే స్టేషన్లు, పల్లెల్లో ప్రతిఘటన ద్వారా వణుకు పుట్టించారన్నారు. సిపిఐ మండల కార్యవర్గ సభ్యునిగా, వర్ధూరు వార్డు మెంబర్‌గా, నీటి సంఘం చైర్మన్‌గా ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన లేని లోటు కమ్యూనిస్టు పార్టీకి తీరనిదన్నారు. లింగయ్య గారి ఆశయ సాధన కోసం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ సెక్రెటరీ సుదగాని వెంకన్న, గట్టికొప్పుల సరిత, మచ్చేందర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ముసుకు పెంటారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, పశువుల నరసింహ, సుదర్శన్, పల్లె శ్రీనివాస్, కర్ర సిద్దులు, నల్ల రాములు, గువ్వ వెంకన్న, పువ్వా కమలమ్మ, ఉప సర్పంచ్ మోర శ్రీనివాసరెడ్డి, నోముల మహేందర్, గట్టికొప్పుల లక్ష్మీనారాయణ, గట్టికొప్పుల అమరేందర్, గట్టికొప్పుల శ్రీనివాస్, గట్టికొప్పుల మల్లయ్య, కుటుంబ సభ్యులు పువ్వ సిద్దులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# 7 లోపు గురుకుల కళాశాలలో చేరాలి

మోత్కూరు, జూన్ 01 ( వార్త వేదిక సూర్య ): తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశన ప్రక్రియలో ఎంపికైన విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలలో ఈ నెల 07 లోపు తప్పనిసరిగా చేరాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల మోత్కూరు ప్రిన్సిపల్ ఎం.స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అడ్మిషన్ కు సంబంధించి సమాచారం అందుకున్న విద్యార్థులు నిర్ణీత గడువులోగా సంబంధిత కళాశాల చేరి తమ ప్రవేశాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు. గడువు తేదీ అనంతరం గడువులోగా సంస్థ నిబంధన అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 2 సంచిక : 13
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి మంగళవారం, జూన్, 2, 2026

# మున్సిపల్ కమీషనర్ బాధ్యతలు స్వీకరించిన నర్సయ్య



**మోత్కూరు, జూన్ 01 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కమీషనర్ గా గోలుకొండ నర్సయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన కమీషనర్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధి లో ఏలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి నేరుగా తీసుకురావాలని కోరారు.

# మూడో డిస్కం ( కిసాన్ )ను ఉపసంహరించుకోవాలి

**- సిపిఎం డిమాండ్**



**మోత్కూరు, జూన్ 01( వార్త వేదిక సూర్య):** రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడో డిస్కం (కిసాన్) వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మోత్కూరులో విలేఖరులతో మాట్లాడుతూ .ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడో డిస్కం ( కిసాన్ ) వల్ల విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. గతంలో ప్రపంచ బ్యాంక్ ఆదేశాలను ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసెందుకు ప్రయత్నం చేసినప్పుడు అప్పట్లోనే ప్రజలల్లో తీవ్ర ప్రతిఘటన వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడ బడా కార్పొరేట్లకు విద్యుత్ రంగాన్ని అప్ప చెప్పే ప్రయత్నం చేస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మూడో డిస్కం ను రద్దుచేసి విద్యుత్ పంపిణి బాధ్యతలను ప్రస్తుత వ్యవస్థ ద్వారానే కొనసాగించాలని, కోరారు.అందరికీ విద్యుత్ అందించేలా, క్రాస్ సబ్సిడీ కొనసాగించే విధంగా అమలు చేయాలని వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఘనంగా రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**మోత్కూరు, జూన్ 01 ( వార్త వేదిక సూర్య):** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి మాజీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో డిసిసి ఉపాధ్యక్షులు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేక్ కట్ చేసి, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా, కౌన్సిలర్లు పన్నాల శ్రీవిద్య, కారు పోతుల వెంకన్న గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, మండల, పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ అన్నెపు పద్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ సమీర్, మాజీ సర్పంచులు తండ సత్తయ్య సూదగాని పాండు, స్థానిక నాయకులు మెంట నగేష్ బయ్యని రాజు, పాలోజు శేఖరాచారి, జినుకుల కనకయ్య , కూరెళ్ళ కుమార్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.. జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మోత్కూరు కాంగ్రెస్ నాయకులు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్ ఆయన నివాసంలో జరిగిన ఈ వేడుకల్లో మోత్కూరు కాంగ్రెస్ నాయకులు పాల్గొని రాజగోపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, ఆది ఎంపిటిసి లెంకల వేణు,స్థానిక నాయకులు బండారు వెంకట్ రెడ్డి, కోమటి జనార్ధన్, అవిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రోహిణి కార్తెలో వర్షాల కోసం రైతులు ఎదురుచూపులు

**మోత్కూరు; జూన్ 01 ( వార్త వేదిక సూర్య):** వ్యవసాయ రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన రోహిణి కార్తె ఈసారి రైతుల్లో ఆశల కంటే ఆందోళననే ఎక్కువగా పెరుగుతుంది. సాధారణంగా రోహిణి కార్తె ప్రారంభమైతే వర్షాలు కురిసి ఖరీఫ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రైతులు నమ్ముతు ఒటారు. అయితే గత కొన్నేళ్లుగా రోహిణి కార్తెలో సరైన వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోంది.ఒకప్పుడు రోహిణి కార్తె వచ్చిందంటే వానలు ఖాయం అనే నమ్మకం గ్రామీణ ప్రాంతాల్లో బలంగా ఉండేది.ఈ కార్తెలో పడే వర్షాలతో రైతులు పొలాలను దున్ని విత్తనాలు సిద్ధం చేసుకునేవారు. చెరువులలో, కుంటలలో వరద నీరు చేరడంతో సాగుకు ఊపిరి లభించేది.

కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రోహిణి కార్తె నడి నెత్తి పైకి వచ్చిన వచ్చినా వర్షాలు జాడలేదు ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతూ ఉండడంతో భూములు ఎండిపోతుండగా, భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయి. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు విత్తనాలు కొనాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికే పెట్టుబడుల భారం, ఎరువులు, విత్తనాల ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రకృతి కూడా సహకరించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి కారణాలతో సీజన్ల స్వభావం మారిపోతోందని నిపుణులు చెబుతున్నారు.

అకాల వర్షాలు, దీర్ఘకాల ఎండలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వారు పేర్కొంటున్నారు. రైతు ఆశలు మళ్లీ పచ్చగా



మారాలంటే ప్రకృతి కరుణించాల్సిందేనని వారు పేర్కొంటున్నారు.

# పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి

**మోటకొండూరు ఎంపీడీవో ఆఫీస్ ముందు సీఐటీయూ ధర్నా!**

**మోటకొండూరు, జూన్ 01(వార్త వేధిక సూర్య):** గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని, వారికి కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లూరి ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మోటకొండూరు మండల ఎంపీడీవో కార్యాలయం ముందు సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం తమ న్యాయమైన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో ఇందిరా కి సమర్పించారు.ఈ సందర్భంగా కొల్లూరి ఆంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 12,790 గ్రామపంచాయతీల్లో 60 వేల మందికి పైగా కార్మికులు రాత్రింబగళ్లు సేవలందిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఏళ్ల తరబడి పనిచేసినా ఉద్యోగ భద్రత లేకపోవడం శోచనీయమన్నారు. వీరికి పర్మినెంట్ హోదా కల్పించి, పీఎఫ్ , ఈఎస్ఐ , ప్రమాద బీమా లాంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి ప్రకటన ప్రకారం కార్మికుల వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని, వారిని రెండవ పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ లో నమోదు కాని కార్మికుల పేర్లను తక్షణమే నమోదు చేయాలన్నారు. మల్టీపర్పస్ పేరుతో కార్మికులతో నైపుణ్యం లేని పనులు చేయించడం వల్ల వారు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్లు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించకపోవడం, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించకపోవడం వల్ల ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కార్మికులకు ఎలాంటి నష్టపరిహారం అందని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికులను ఆదుకోకపోతే ఉ




ద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కోసంగి పరమేశ్వర్, బోగారం వీరస్వామి, బొట్ల గణేష్, పానుగంటి లక్ష్మీ నరసయ్య, బొట్ల మైసయ్య, బోగారం చంద్రమ్మ, కొంపెల్లి ఎల్లమ్మ, బొట్ల లలిత, వంగపల్లి ఉపేంద్ర, వంగపల్లి ఈరమ్మ మరియు మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

**- లబ్ధిదారుల ఇళ్లకు రిబ్బన్ కట్ చేసిన సర్పంచ్ వేల్పుల రజిత శ్రీరాములు!**

**మోటకొండూరు, జూన్ 01 (వార్త వేధిక సూర్య):** మోటకొండూరు మండల పరిధిలోని పెద్దబావి (చకంపల్లి) గ్రామంలో అర్హులైన నిరుపేదల సొంతింటి కల సాకారమవుతోంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నాడు అత్యంత కోలాహలంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ వేల్పుల రజిత శ్రీరాములు పాల్గొని, లబ్ధిదారులు వేల్పుల లావణ్య – సురేష్ నూతన ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్ కట్ చేసి పాలుపొంగించి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు శాశ్వత



నివాసం ఏర్పడటం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామ పాలకవర్గం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. సొంతింటి కల నెరవేరినందుకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు జల్తా రాజు, బండ రజిని, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సాపిడి ఉపేందర్, ముఖ్య



నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్ కలిసిన వైస్ చైర్మెన్



**మోత్కూరు, జూన్ 01 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కమీషనర్ గా సోమవారం నూతన బాధ్యతలు స్వీకరించిన గోలుకొండ నర్సయ్యను మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా ను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఆత్మీయ సన్మానం చేశారు.

# కాంగ్రెస్ పాలనలోనే పేదల న్యాయం



**మోత్కూరు, జూన్ 01 ( వార్త వేదిక సూర్య):** కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని వార్డుకు ఒక ఇల్లు చొప్పున 12 వార్డులలో ఇందిరమ్మ లబ్ధిదారుల కలిసి సామూహిక ప్రవేశాలను చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు,వార్డు అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**